ఉత్సాహంగా ముగ్గుల పోటీలు



మౌలాలి ఈస్ట్ మారుతీనగర్‌లో బహుమతులు అందజేస్తూ..

మౌలాలి: మల్కాజిగిరి నియోజకవర్గ బీజేపీ మహిళా మోర్చా కన్వీనర్ డి.పద్మజారెడ్డి ఆధ్వర్యంలో బుధవారం మౌలాలి ఈస్ట్ మారుతీనగర్‌లో ముగ్గుల పోటీలు నిర్వహించారు. పోటీలకు స్థానిక మహిళలు హాజరై రంగురంగుల ముగ్గులను వేశారు. అనంతరం విజేతలకు ఆమె బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు జ్యోతిబాయి, కనకదుర్గ, గున్నాల లక్ష్మణ్‌గౌడ్, సంతోష్‌గౌడ్, లింగారావు, సచిన్, కిరణ్ శ్రయి, జ్యోతిర్మయి లలిత, స్వర్ణమంజరి, రేణుక, పూర్ణిమ, పద్మ, సుజాత, శ్రీదేవి, విజయ, సుజాత, సుమ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ముగ్గుల పోటీలు

మల్లాపూర్: డివిజన్ పరిధిలోని అశోక్‌నగర్ కాలనీలో నిర్వహించిన ముగ్గుల పోటీలు అలరించాయి. ముఖ్య అతిథిగా హాజరైన బీఆర్‌ఎస్ సీనియర్ నేత బోదాసు లక్ష్మీనారాయణ ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో వరికుప్పల నరసింహ, కోటేశ్వరీ, లలిత, యశోద, రత్న, రాణి, సంధ్య, మంజుల పాల్గొన్నారు.

ఘనంగా మైనంపల్లి జన్మదిన వేడుకలు



జీఎన్వీ సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో వేడుకల్లో శివాంక్

మల్కాజిగిరి: మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు జన్మదిన వేడుకలు మల్కాజిగిరిలో ఘనంగా జరిగాయి. ఆర్‌కేనగర్‌లో సీనియర్ నాయకుడు జీఎన్వీ సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో మైనంపల్లి కుమారుడు శివాంక్ హాజరై కేక్ కట్ చేశారు. వెంకటేష్‌యాదవ్ ఆధ్వర్యంలో మల్కాజిగిరి చౌరస్తాలో జరిగిన వేడుకల్లో కేక్ కట్ చేశారు. అనంతరం శ్రీదేవి ఫంక్షన్ హాల్‌లో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు.

పైప్‌లైన్‌కు మరమ్మతులు



పైప్‌లైన్ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ ప్రభుదాస్

కుషాయిగూడ: మీర్‌పేట్–హెచ్‌బీకాలనీ డివిజన్, కృష్ణానగర్ కాలనీ రోడ్డు నంబరు–2లో చేపట్టిన నీటి పైప్‌లైన్ పనులను బుధవారం కార్పొరేటర్ ప్రభుదాస్ అధికారులతో కలిసి పరిశీలించారు. నీటి ప్రధాన పైప్‌లైన్ లీకేజీ సమస్యను స్థానికులు కార్పొరేటర్ దృష్టికి తీసుకురావడంతో ఆయన వెంటనే స్పందించి అధికారులతో మాట్లాడి మరమ్మతులు చేయించారు. ఆయన వెంట వాటర్‌వర్క్స్ మేనేజర్ వేణుగోపాల్, సౌమ్య తదితరులు ఉన్నారు.

నాణ్యమైన ఉత్పత్తులను అందించాలి

హబ్సిగూడ: వినియోగదారులకు నాణ్యమైన ఉత్పత్తులను అందించాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. హబ్సిగూడ డివిజన్ వీధి నెంబర్–8లో ఏర్పాటు చేసిన రైమండ్స్ కేఎస్ ఫ్యాషన్ నూతన వస్త్రాలయాన్ని బుధవారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. వస్త్రాలయ నిర్వాహకులు అశ్విన్‌రెడ్డి, సురేష్‌గౌడ్, బీఆర్‌ఎస్ నాయకులు రాగిడి లక్ష్మారెడ్డి, డివిజన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పుష్పయాగం



మల్కాజిగిరి: ఆనంద్‌బాగ్ లక్ష్మీ వేంకటేశ్వర దేవస్థానంలో ధనుర్మాస పూజల్లో భాగంగా బుధవారం వివిధ రకాల పుష్పాలతో పుష్పయాగాన్ని ప్రధాన అర్చకులు ముడుంబై వేంకట రమణాచార్యులు, అర్చకులు తులసి రమణాచార్యులు నిర్వహించారు.

నిర్మించారు.. కూల్చేశారు..



మేడిపల్లి: వీధి వ్యాపారుల కోసం లక్షల రూపాయలు వెచ్చించి ప్రజాప్రతినిధులు స్టాళ్లను నిర్మించారు. ఆ స్థలం హెచ్‌ఎండీఏకు కేటాయించడంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు బుధవారం అధికారులు స్టాళ్లను నేలమట్టం చేశారు. వివరాలు.. పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పాలకవర్గం నిధులను విడుదల చేసి రెండు సంవత్సరాల క్రితం 15వ డివిజన్ పర్వతాపూర్ రోడ్డు సర్వే నంబర్–108 ప్రభుత్వ భూమిలో స్ట్రీట్ వెండర్స్ కోసం స్టాళ్లను నిర్మించింది. ఇప్పటి వరకు అర్హులకు కేటాయించకుండా నిర్లక్ష్యంగా వదిలేశారు. అయితే ప్రభుత్వం ఆ స్థలాన్ని హెచ్‌ఎండీఏకు అప్పగించడంతో కూల్చివేతలు మొదలయ్యాయి. గతంలోనే కూల్చివేతలు మొదలుపెట్టగా పలువురు అడ్డుకోవడంతో తాత్కాలికంగా నిలిపివేశారు. తిరిగి బుధవారం స్టాళ్లను నేలమట్టం చేశారు.

అవిశ్వాస రాగం..

ఘట్‌కేసర్ చైర్ పర్సన్, వైస్ చైర్మన్ పదవులకు ఎసరు?

- అవిశ్వానికి పావులు కదుపుతున్న సొంత పార్టీ నేతలు
- అవిశ్వాసం నుంచి తప్పించుకునేందుకు ప్రయత్నాలు
- ఫిబ్రవరి నెలలో మలేషియా వెళ్లేందుకు ప్రణాళికలు

పావనీజంగయ్య





మాధవరెడ్డి



ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ మున్సిపాలిటీ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌పై సొంత పార్టీ కౌన్సిలర్లు అవిశ్వాసం పెట్టేందుకు పావులు కదుపుతున్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఓడగానే సద్దుమణగాల్సింది పోయి మరింత వేగం పెంచారు. కాంగ్రెస్ కౌన్సిలర్లు అవిశ్వాసం పెట్టాల్సి ఉండగా.. చైర్ పర్సన్ ఒంటెద్దు పోకడలు పోతున్నారని ఆరోపిస్తూ సొంత పార్టీ కౌన్సిలర్లే ప్రణాళికలు రచిస్తున్నారు. ఇప్పటి వరకు చైర్ పర్సన్‌పైనే అనుకున్న అవిశ్వాసం కాస్తా అంతకంటే బలంగా వైస్ చైర్మన్‌పైకి మళ్లింది. అందులో సొంత పార్టీ కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి మద్దతిస్తామని తెలపడంతో అవిశ్వాసం బలంగా కనిపిస్తోంది. మూడేళ్లు దాటగానే అవిశ్వాసం రాగమెత్తిన బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు మాజీ మంత్రి, ఎమ్మెల్యే మల్లారెడ్డి ఆదేశానుసారం అప్పట్లో మిన్నకుండిపోయారు. జనవరితో మున్సిపల్ పాలకవర్గం నాలుగేళ్లు పూర్తి కానున్న నేపథ్యంలో కాంగ్రెస్‌కు మద్దతిచ్చి ఎలాగైనా గద్దెదించాలని అసంతృప్తులు కొత్తరాగం ఎత్తుతున్నారని సమాచారం. ఇతంతా ఉట్టి బెదిరింపులేనని, చూస్తూ కావాలని చైర్ పర్సన్ సీటును కాంగ్రెస్‌కు అప్పగించరని ప్రజలు అంటున్నారు.

మారిన సమీకరణాలు..

మున్సిపాలిటీలోని 18 వార్డులకు 2020 జనవరిలో జరిగిన ఎన్నికల్లో అప్పటి అధికార పార్టీ బీఆర్‌ఎస్ 10 వార్డులు గెలుచుకోగా, కాంగ్రెస్ అభ్యర్థులు 4 వార్డులు, ఇండిపెండెంట్లు నలుగురు విజయం సాధించారు. ఎన్నికల అనంతరం ఒక ఇండిపెండెంట్, కోఆప్షన్ ఎన్నికల సమయంలో ఇద్దరు కాంగ్రెస్, ఇద్దరు ఇండిపెండెంట్లు బీఆర్‌ఎస్‌లో చేరారు. మల్కాజ్‌గిరి ఎంపీగా ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి గెలవగానే మిగిలిన ఇద్దరు కాంగ్రెస్ కౌన్సిలర్లు మాజీ మంత్రి అండతో అధికార బీఆర్‌ఎస్‌లో చేరడంతో మెజారిటీ 17కు చేరుకోగా ఒకరు ఇండిపెండెంటుగా ఉన్నారు. మొన్న జరిగిన ఎమ్మెల్యే ఎన్నికలకు ముందు బీఆర్‌ఎస్ గుర్తుపై గెలిచిన ముగ్గురు కౌన్సిలర్లు, కాంగ్రెస్ గుర్తుపై గెలిచిన ఇద్దరు, ఒక ఇండిపెండెంట్ తిరిగి కాంగ్రెస్‌లో చేరడంతో బీఆర్‌ఎస్ మెజారిటీ 11కు తగ్గింది. జనవరితో అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు అవకాశం ఉండటంతో రాజకీయ వాతావరణం వేడెక్కింది.

సొంత పార్టీ వారి వెన్నుపోటు..

గతంలో పదవి కోసం ప్రయత్నించి విఫలమైన వారు తిరిగి ప్రయత్నాలు ప్రారంభించారు. బీఆర్‌ఎస్‌కు చెందిన మెజారిటీ కౌన్సిలర్లం మద్దతిస్తాం, చైర్ పర్సన్‌పై అవిశ్వాసానికి సిద్ధం కావాలని ఓ బీఆర్‌ఎస్ ప్రముఖ నాయకుడు కాంగ్రెస్‌లో చేరిన కౌన్సిలర్‌కు ఆఫర్ ఇచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. ఆ కౌన్సిలర్ కూడా గతంలో చైర్ పర్సన్ సీటు ఆశించిన వారు కావడం విశేషం. ఇటీవల ఘట్‌కేసర్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే ఆ కౌన్సిలర్‌ను ఆశీర్వదించినట్లు బీఆర్‌ఎస్ నాయకులే అంటున్నారు. ఎవరైనా బీఆర్‌ఎస్ అభ్యర్థే చైర్ పర్సన్‌గా ఉండాలని అన్నట్లు మరో ప్రచారం జరుగుతోంది.

వైస్ చైర్మన్‌ను వదలం..

ఇటీవల ఓ కౌన్సిలర్ ఇంట్లో మంతనాలు జరిపి వైస్ చైర్మన్‌ను కూడా పదవి నుంచి తప్పించాలని చర్చించుకున్నట్లు తెలుస్తోంది. మెజారిటీ కౌన్సిలర్లు కూడా వైస్ చైర్మన్‌పై అవిశ్వాసానికి సిద్ధంగా ఉన్నామన్నట్లు వినికిడి. ఇద్దరిపై అవిశ్వాసం పెట్టి తొలగించాలని వ్యవహారం నడిపిస్తున్నారు. చైర్ పర్సన్‌పై అవిశ్వాసానికి మెజారిటీ కౌన్సిలర్లు సిద్ధంగా లేమని, వైస్ చైర్మన్‌పై అవిశ్వాసం సరేనని అంటున్నారు.

ఆర్థికంగా లబ్ధిపొందాలని అవిశ్వాసం..

అవిశ్వాసం నెగ్గదని తెలిసినా ఆర్థికంగా లాభపడాలని తెరపైకి తెస్తున్నట్లు కొందరు కౌన్సిలర్లు అంటున్నారు. ఈ నేపథ్యంలో ఘట్‌కేసర్ గుట్టుమైసమ్మ అమ్మవారి జాతర ఈ నెల 28న జరగాల్సి ఉన్నందున ఫిబ్రవరి 3 తర్వాత మెజారిటీ కౌన్సిలర్లతో మలేషియా వెళ్లేందుకు ప్రణాళికలు రచిస్తున్నారు. ఇదంతా చైర్ పర్సన్, వైస్ చైర్మన్ నుంచి లబ్ధిపొందడానికి ఆడుతున్న నాటకమని, గతంలో పదవులు ఆశించి భంగపడ్డవారే తెరచాటున ఉండి తతంగం నడిపిస్తున్నారని ప్రజలు అంటున్నారు.

అవిశ్వాసానికి కావాల్సింది 14 మంది కౌన్సిలర్లు..

ప్రస్తుతం కౌన్సిల్‌లో 11 మంది బీఆర్‌ఎస్, ఆరుగురు కాంగ్రెస్, ఒక ఇండిపెండెంట్ కౌన్సిలర్ ఉన్నారు. అవిశ్వాసం పెట్టాలంటే 14 మంది కౌన్సిలర్ల సంతకం అవసరం కాగా, పదవులు కాపాడుకోవాలంటే 10 మంది కౌన్సిలర్ల బలం ఉండే చాలు. కౌన్సిల్ పదవి కాలం ఉన్నది ఏడాదైనా ఆర్థిక భారం భరించేవారెవరు, మద్దతు ఇచ్చేవారెవరో తెలియని అయోమయ స్థితిలో అవిశ్వాసముంది. ఏదిఏమైనా చైర్ పర్సన్, వైస్ చైర్మన్‌పై అవిశ్వాసం నాటకమా, ఆర్థిక కోణమా, నిజంగా గద్దెదించుతారా అన్నది ఫిబ్రవరి మొదటి వారంలో తేలనుంది. అప్పటి వరకు వేచిచూడాల్సిందే.

కరెంటు ఉండని ప్రాంతాలు

కాప్రా: విద్యుత్ లైన్ మరమ్మతుల కారణంగా సైనిక్‌పురి సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ఫీడర్లలో గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఏఈ తెలిపారు. శాలివాహన ఎన్‌క్లేవ్, సాధనవిహార్, హైటెన్షన్‌రోడ్, జనప్రియ, గ్రీన్‌పార్క్‌కాలనీ, వంపుగూడ 11కేవీ ఫీడర్ల పరిధిలోని వంపుగూడ, ఎల్లారెడ్డిగూడ, కాప్రా, నేతాజీనగర్, గ్రీన్‌పార్క్, శంభికాలనీ, జనప్రియ టౌన్‌షిప్, ప్రశాంత్‌నగర్, క్రిష్ణనగర్, శాలివాహన ఎన్‌క్లేవ్, ఎస్టీ కాలనీ, సాయిప్రియ కాలనీ, అశోక్ కాలనీకి ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదు.

ఆనంద్‌బాగ్ సబ్‌స్టేషన్ పరిధిలో..

మల్కాజిగిరి: ఆనంద్‌బాగ్ సబ్‌స్టేషన్ పరిధిలోని వివిధ ఫీడర్ల పరిధిలో గురువారం మరమ్మతులు జరుగుతాయని ఏఈ శ్రీనివాసులు, లైన్ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరరావు తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు 11 కేవీ ఎన్‌ఎండీసీ ఫీడర్ పరిధిలోని ఎన్‌ఎండీసీ కాలనీ, సీఫెల్ కాలనీ, కళ్యాణ్‌నగర్, తాళ్లబస్తీ, ఆనంద్‌బాగ్ ప్రాంతాల్లో, 11 కేవీ అనంతసరస్వతీనగర్ ఫీడర్ పరిధిలోని అనంతసరస్వతీనగర్, ఈస్ట్ ఆనంద్‌బాగ్ ప్రాంతాల్లో, 11 కేవీ బాలసరస్వతీనగర్ ఫీడర్ పరిధిలో విష్ణుపురికాలనీ, విమలాదేవి నగర్, రాజీవ్‌గాంధీనగర్, భ్రమరాంబికనగర్ ప్రాంతాల్లో, 11 కేవీ కృపానంద్ ఫీడర్ పరిధిలో వెస్ట్ ఆనంద్‌బాగ్, ఏడీఆర్ ఆస్పత్రి, కృపానంద్ అపార్ట్‌మెంట్స్ ప్రాంతాల్లో, 11 కేవీ పీటీ కాలనీ ఫీడర్ పరిధిలో పీటీ కాలనీ, వినాయకనగర్ బ్లాక్–2 ప్రాంతాల్లో, 11 కేవీ చంద్రగిరి కాలనీ ఫీడర్ పరిధిలో శివగౌరి ఎన్‌క్లేవ్, చంద్రగిరి కాలనీ, నలంద స్కూల్ ప్రాంతం, డీఏవీ స్కూల్ ప్రాంతం, నవభారత్ కాలనీ, వినాయకనగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదు.

ఆత్మవిశ్వాసంతోనే ఉన్నత స్థాయికి..

రామంతాపూర్: ప్రభుత్వ జవహర్‌లాల్ నెహ్రూ పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో బుధవారం రాష్ట్రస్థాయి పాలిటెక్నిక్ కళాశాలల క్రీడా పోటీలను రాష్ట్ర సాంకేతిక విద్య జాయింట్ డైరెక్టర్ జి.శ్రీనాథ్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటలతో ఆత్మస్థైర్యం, ఆరోగ్యం కలిగి ఆత్మవిశ్వాసంతో ఉన్నత స్థానాలకు ఎదగవచ్చని అన్నారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులను అంతర్రాష్ట్ర పాలిటెక్నిక్ కళాశాల పోటీల్లో పాల్గొనే అవకాశం కల్పిస్తామని అన్నారు. కార్యక్రమంలో సాంకేతిక విద్య కార్యదర్శి పుల్లయ్య, వినయ్‌కుమార్, కృష్ణారావు, టీవీ రావు, సురేష్ నాయక్, రేణుక తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడిపై వీధి కుక్కదాడి

కుషాయిగూడ: రోడ్డు వెంట నడుచుకుంటూ వెళ్తున్న ఓ వృద్ధుడిని వీధి కుక్క గాయపరిచింది. ఈ ఘటన చర్లపల్లి డివిజన్ శివసాయినగర్ కాలనీలో చోటు చేసుకుంది. కాలనీకి చెందిన జంగయ్య బయటకు వెళ్లి ఇంటికి తిరిగి వస్తుండగా వీధి కుక్క దాడి చేసి గాయపరిచింది. వీధి కుక్కల దాడుల ఘటనలు తరచూ కాలనీలో చోటుచేసుకుంటున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని స్థానికులు అంటున్నారు. కాలనీలో గుంపులుగా తిరుగుతున్న వీధి కుక్కలతో ఇబ్బందులు పడుతున్నామంటూ పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయిందంటున్నారు. అధికారులు స్పందించి వీధి కుక్కల దాడుల నుంచి విముక్తి కలిగించాలని కోరుతున్నారు.

ఏ సమస్య వచ్చినా అండగా ఉంటా..



ఎమ్మెల్యే లక్ష్మారెడ్డిని సన్మానిస్తున్న పద్మశాలి సంఘం ప్రతినిధులు



ముగ్గుల పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

ఉప్పల్ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

ఉప్పల్: అన్ని కుల సంఘాలకు అందుబాటులో ఉండి వారికి ఎలాంటి సమస్యలు వచ్చినా ఆదుకుంటానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. ఈ మేరకు బుధవారం పద్మశాలి కుల సంఘాల నేతలు ఆయనను కలిసి శాలువాతో సత్కరించి చేనేత మగ్గంపై నేసిన బండారి లక్ష్మారెడ్డి చిత్రపటాన్ని బహుకరించారు. ఆయన మాట్లాడుతూ పార్టీలకతీతంగా పని చేస్తానన్నారు. కార్యక్రమంలో చేర్యాల శ్రీనివాస్, వల్లాల కృష్ణ, ప్రసాద్, బాలకిషన్, మాటాటి యాదగిరి, గడ్డం పాపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతి సంప్రదాయాలను కాపాడాలి

కుషాయిగూడ: హిందూ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. సంక్రాంతి పండగను పురస్కరించుకొని అభయ అసోసియేషన్ ఫర్ ఎంపర్‌మెంట్ ఆఫ్ ఉమెన్ సంస్థ ఆధ్వర్యంలో బుధవారం చక్రిపురంలో నిర్వహించిన ముత్యాల ముగ్గుల పోటీలను ఆయన ప్రారంభించారు. విజేతలకు బహుమతులను ప్రదానం చేయడంతో పాటుగా పోటీల్లో పాల్గొన్న వారందరికీ కన్సోలేషన్ బహుమతులను అందజేశారు. స్థానిక బీఆర్‌ఎస్ సీనియర్ నేత అనుములు నర్సింహారెడ్డి సహకారం అందజేయగా స్థానిక నేతలు నేమూరి మహేష్‌గౌడ్, వెంకటేష్‌గౌడ్ సంస్థ ప్రతినిధులు ఉషా, ఝాన్సీ, పద్మ, విజయలక్ష్మీ పాల్గొన్నారు.

అండగా ఉంటా..

గెలుపు కోసం పాటుపడ్డ శుభోదయనగర్ కాలనీవాసులకు అండగా ఉంటానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. బుధవారం కాలనీ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను ఘనంగ సత్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కాలనీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కార్పొరేటర్ బొంతు శ్రీదేవి, స్థానిక నేతలు నాగిళ్ల బాల్‌రెడ్డి, శివకుమార్ గౌడ్, నేమూరి మహేష్‌గౌడ్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ బొంతు శ్రీదేవి

పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనుల్లో వేగం పెంచి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. కుషాయిగూడ, చాకలిబస్తీ, చర్లపల్లి సెయింట్ జోసఫ్ కాలనీల్లో సీసీ రోడ్డు పనులను బుధవారం స్థానిక కార్పొరేటర్ బొంతు శ్రీదేవితో కలిసి ప్రారంభించారు. ఏఈ స్వరూప, మాజీ కార్పొరేటర్ సింగిరెడ్డి ధన్‌పాల్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు సింగిరెడ్డి సోమశేఖర్‌రెడ్డి, నాగిళ్ల బాల్‌రెడ్డి, అనిల్ ముదిరాజ్, గంప కృష్ణ, నేమూరి మహేష్‌గౌడ్, శ్రీకాంత్‌యాదవ్, ఉపేందర్, వెంకటేష్‌గౌడ్, పనగట్ల చక్రపాణిగౌడ్, చల్లా వీరేషం తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్ తొలగించాలని ధర్నా

కాప్రా: ఆదిత్యనగర్‌లో వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసి చట్టవిరుద్ధంగా ట్యాంకర్ల ద్వారా నీటిని విక్రయిస్తున్నారని ఆరోపిస్తూ ధర్నా నిర్వహించారు. ఇప్పటికే ఈ ప్రాంతంలో భూగర్భ జలాలు అడుగంటి కాలనీవాసులకు నీటి కొరత ఉందని, దానికి తోడు ఇలా బోరు ద్వారా నీటిని తోడి ట్యాంకర్ల ద్వారా విక్రయిస్తూ ఇతరులకు నీటిని అందుబాటులో లేకుండా చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే సంబంధిత అధికారులు ఈ ప్లాంట్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు నాగిరెడ్డి సంజీవరెడ్డి, సెక్రటరీ శేషం, రామాచారి, కాలనీవాసులు మయూరి సురేష్, కోల రాజు, ప్రసాద్, సాంబశివరావు, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.



ఆదిత్యనగర్‌లో ధర్నా చేస్తున్న స్థానికులు

ఇంటింటికీ శ్రీరాముడి అక్షింతలు



కాప్రా: అయోధ్యలో ఈ నెల 22న బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ సందర్భంగా శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ అయోధ్యలో ప్రత్యేక పూజలు చేసిన అక్షింతలు కాప్రా సర్కిల్‌కు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఏఎస్‌రావునగర్ డివిజన్‌లో శోభాయాత్రగా అయోధ్య రాముడి అక్షింతల పంపిణీ ప్రారంభించారు. ఏఎస్‌రావునగర్ హనుమాన్ ఆలయం నుంచి ప్రారంభమైన శోభాయాత్ర శారద థియేటర్, హైటెన్షన్ రోడ్, మహేష్‌నగర్, కమలానగర్ వరకు కొనసాగింది. శోభాయాత్ర ద్వారా ఇంటింటికీ రాములోరి అక్షింతలు అందజేస్తూ వాటి గురించి ప్రజలకు అవగాహన కల్పిస్తూ ముందుకు సాగారు. కార్యక్రమంలో ఆర్గనైజర్లు కిషోర్ రామసాగర్, ప్రభాకర్‌రెడ్డి, సోమేష్ నాయుడు, సందీప్ పరికిబాండ, సురేష్ ధరమ్‌కర్, స్థానికులు రమేష్ యాదవ్, కుంతల కిరణ్, మోహన్‌రెడ్డి, రూపరెడ్డి, పాపిరెడ్డి, అనిల్, వెంకటాచలం, శ్రీధర్, చిత్తారి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ వైద్య సేవలు అందాలి



వైద్య శిబిరంలో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

బోడుప్పల్: సమాజంలో ప్రతి ఒక్కరికీ వైద్య సేవలు అందాల్సిన అవసరం ఉందని అనఘాపురి కాలనీ అధ్యక్షుడు జయపాల్‌రెడ్డి అన్నారు. అభయ మల్టీ స్పెషాలిటీ ట్రస్ట్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో అనఘాపురి కాలనీలో బుధవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందాల్సిన అవసరం ఉందన్నారు. బస్తీల్లో ఇలాంటి వైద్య సేవలు అందించడం ద్వారా హాస్పిటల్‌కు వెళ్లలేని వారికి ఎంతో మేలు జరుగుతుందన్నారు. వైద్య శిబిరంలో షుగర్, బీపీ, కంటి పరీక్షలు నిర్వహించారు. జనహిత సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో అవసరమైన వారికి ఉచితంగా మందులను అందజేశారు. కార్యక్రమంలో అభయ హాస్పిటల్ వైద్యులు క్రాంతి, క్యాంపు కో ఆర్డినేటర్ జహంగీర్, సిబ్బంది సునీత, శైలజ పాల్గొన్నారు.



జయగిరి లక్ష్మీ నర్సింహకాలనీలో ఉద్రిక్తత

- ఇటీవల పలువురికి కోర్టు నోటీసులు
- ఇళ్లను సీజ్ చేసేందుకు వచ్చిన అధికారులు
- బాధితులు అడ్డుకోవడంతో వాగ్వాదం
- పదిరోజులు సమయం కోరిన ఎమ్మెల్యే



జేఎల్ఎన్ఎస్‌నగర్‌లో ఆలయ ఈవో రమాదేవితో బాధితుల వాగ్వాదం, చిత్రంలో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

గౌతంనగర్: జయగిరి లక్ష్మీ నర్సింహస్వామి దేవాలయానికి చెందిన స్థలంలో నిర్మించిన ఇళ్లను ఆలయ అధికారులు సీజ్ చేసేందుకు రావడంతో ఉద్రిక్తత నెలకొంది. బాధితులు తమకు అన్యాయం జరిగిందంటూ అధికారులతో వాగ్వాదానికి దిగారు. ఏళ్ల క్రితం నిర్మించుకున్న ఇళ్ల నుంచి బయటకు వెళ్లగొట్టి సీజ్ చేయడానికి నిరసనగా బాధితులు ఆలయ ప్రాంగణం వద్ద నిరసన వ్యక్తం చేశారు. వివరాలు.. జయగిరి లక్ష్మీ నర్సింహ స్వామి ఆలయానికి చెందిన సుమారు 17 ఎకరాల 16 గుంటల భూమి ఉంది. ఇందులో 8 ఎకరాలు కొన్నేళ్ల క్రితం ఆలయ నిర్వాహణలో భాగంగా స్థానిక అన్నపూర్ణ సొసైటీకి సుమారు 8 ఎకరాలను అప్పగించారు. మరో 4 ఎకరాల్లో దేవాలయ నిర్మాణాలు, మిగతా 3 ఎకరాలు దేవాలయం పరిధిలో ఉంది. మరో రెండు ఎకరాల్లో కొంతమంది 40 ఏళ్ల క్రితం ఇంటి నిర్మాణాలు చేసుకున్నారు. కొన్ని ఇళ్లు క్రమబద్ధీకరణ కాగా.. మరికొన్ని క్రమబద్ధీకరణకు నోచుకోలేదు. తమ ఇళ్లను కూడా క్రమబద్ధీకరణ చేయాలని బాధితులు ఎన్నోసార్లు వేడుకున్నారు. కానీ వారికి న్యాయం జరగలేదు. ఆలయ అధికారులు ఈ విషయాన్ని ఎండోమెంట్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఎండోమెంట్ ఉన్నతాధికారులు ట్రిబ్యునల్ కోర్టుకు వెళ్లారు. ఈ అంశంపై ట్రిబ్యునల్ కోర్టు నిర్మాణదారులకు ఇటీవల నోటీసులు జారీ చేసింది. కోర్టు నోటీసుల ప్రకారం ఆలయ ఈవో రమాదేవి పోలీసు సిబ్బందితో వెళ్లి ఇళ్లకు తాళాలు వేసి సీజ్ చేసేందుకు ప్రయత్నించగా బాధితులు వాగ్వాదం చేశారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి ఎండోమెంట్ కమిషనర్‌తో మాట్లాడి 10 రోజుల సమయం కోరారు.